



మదనపల్లె : అమిత్‌షా చిత్రపటాలను దహనం చేస్తున్న విసికె పార్టీ శ్రేణులు

సమస్యల్లో 'మధ్యాహ్న భోజన' కార్మికులు

- తక్కువ వేతనాలతో వంట కార్మికుల అవస్థలు
- రూ.10 వేల వేతనం కోసం ఎదురుచూపులు
- నాలుగు నెలలుగా అందని బిల్లులు
- ఇబ్బందుల్లో వంట ఏజెన్సీల నిర్వాహకులు

మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. అరకొర వసతులతో అష్టకష్టాలు పడుతూ విద్యార్థులకు వండి పెడుతున్నా తమకు కనీస వేతనం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అతి కొద్ది వేతనంతో కుటుంబాలను పోషించలేక చాలా మంది మధ్యాహ్న భోజనం కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్నం భోజనం ఏజెన్సీల అవస్థలు తనకు తెలుసని వారికి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.పది వేల వేతనం అందించి ఆదుకుంటామని జగన్మోహన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చేసరికి ఇద్దరూ ఆ హామీని గాలికి వదిలేశారు. నాలుగు నెలలు అవుతున్నా మధ్యాహ్న భోజనం పథకం బిల్లులు అందక వంట చేసిన నిర్వాహకులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లాలో 2,151 ప్రభుత్వ పాఠశాలలు, 1,32,841 మంది విద్యార్థులు, 3,769 మంది మధ్యాహ్నం భోజనం కార్మికులు ఉన్నారు. కొందరు దుకాణాల్లో అప్పు పుట్టక ఇంట్లో ఉన్న వస్తువులను తాకట్టు పెట్టి వాటిని తెచ్చి కూరగాయలు కొని పిల్లలకు మధ్యాహ్న భోజన పథకాన్ని పెడుతున్నారు. అధికారులకు ప్రభుత్వానికి మధ్యాహ్నం భోజన పథకం ఏజెన్సీల బాధలు మాత్రం పట్టిన పాపాన పోలేదు. కొన్నిచోట్ల గ్యాస్ స్టవ్‌లు ఉంటే సకాలంలో గ్యాస్ దొరక్క కొందరు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని పాఠశాలల్లో గ్యాస్ లేకుండా కట్టెల పొయ్యి మీదనే మధ్యాహ్న భోజనం వంటకం చేస్తున్నారు. అలా వంట చేయడం వల్ల ఆ పొగ వంటలు గాలి పీల్చడం వల్ల అనేక వ్యాధులు గురవుతూ ఆసుపత్రి పాలవుతున్నారు. అయినప్పటికీ వారిపై ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. నిర్వాహకులు నిరుద్యోగ సమస్యతో ఇబ్బంది పడుతూ ఇదిగో చిరుద్యోగమని భావిస్తూ ఏదో ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుంటుందని ఆశతో పనులు చేస్తున్నప్పటికీ ఇబ్బంది పడుతున్నారు. సంబంధించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులను బిల్లులు ఇచ్చేలా సాయం చేయమని కోరినా వారు మాత్రం తమకు సంబంధం లేదని అంతా పైఅధికారులు డబ్బులు పంపితే తప్ప తామేమి చేయలేమని ఎలాంటి సాయం అందించి మిమ్మల్ని ఆదుకోలేమంటూ చేతులు ఎత్తేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం మాత్రం నిలపకుండా చేయాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. మూడు నెలలుగా వేతనాల కోసం కార్మికులు ఎదురుచూస్తున్నారు.

మెనూ ప్రకారం అందించాల్సిందే..

వైసిపి హయాంలో ఉన్న జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంగా మార్చారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూ కూడా అమలు చేస్తున్నారు. ఈ మెనూలో విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని సోమవారం నుంచి శనివారం వరకూ ప్రభుత్వం నిర్ణయించిన ఐటమ్స్‌ను అప్పులు చేసి మరీ విద్యార్థులకు అమలు చేస్తున్నారు.



కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న కార్మికులు

భారంగా కూరగాయలు, నిత్యావరస ధరలు

ప్రభుత్వం మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పథకం పిల్లలకు అందించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. మెనూ ప్రకారం నిత్యం భోజనం అందించాలంటే కూరగాయలు, నిత్యావరసర ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అందుతున్నాయి. ఇటీవల కాలంలో ఉల్లిపాయలు కిలో రూ.60 నుండి ఒక్కసారిగా రూ.80 పెరిగాయి. పచ్చిమిర్చి రూ.80, కంది బేడలు రూ.180, తెల్ల గడ్డలు రూ.480, నూనె ధరలు కూడా విపరీతంగా పెరిగాయి.

ఇబ్బందుల్లో వంట కార్మికులు

కొన్ని పాఠశాలలో ప్రభుత్వం ఇచ్చే వేతనం సరిపోవడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు వంట చేయలేక మానుకుంటున్నారు. పిల్లలకు రుచికర భోజనం అందించాలంటూ అధికారులు జారీ చేయడమే కాకుండా అప్పుడప్పుడు తనిఖీలు చేయడం గమనార్హం. కోడిగుడ్లను ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. ఆ పంపిణీ చేసిన గుడ్లలో కూడా చాలా గుడ్లు కాలం చెల్లిని ఉండటం వల్ల అవి కొన్ని పగిలిపోయి ఉంటాయి. ఆ గుడ్లల్లో ప్రతినిత్యం పిల్లలకు ఉడకబెట్టి ఇవ్వాల్సిన పరిస్థితి వంట చేసే వారిదే. రూ.3 వేలు గౌరవతలం సరిపోవడం లేదని రూ.10 వేలు గౌరవేతనం ఇవ్వాలని కోరుతున్నారు. నేతలు మారినా తమ రాతలు మాత్రం మారలేదని ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ యంత్రాంగం స్పందించి తమకు బిల్లులు చెల్లించి, వేతనం అందించే ఆదుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనం పెంచాలి

ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి పిల్లలకు వంట చేస్తున్నాం. ఈ పని తప్పితే వేరే పనికి వెళ్లలేకున్నాం. ప్రభుత్వం ఇస్తున్న రూ.3 వేలు గౌరవేతనం సరిపోవడం లేదు. రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలి. నిత్యావసర సరుకులు, కూరగాయలు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వంట సామగ్రి కూడా మేమే కొనుగోలు చేయాలి. ప్రభుత్వం స్పందించి రూ.పది వేలు వేతనం ఇవ్వాలి.



- సుజాత, వంట ఏజెన్సీ కార్మికులు, రాయచోటి.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మధ్యాహ్న భోజన కార్మికులు చాలా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు లేవు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు గ్యాస్, వంట మాత్రలు సరఫరా చేయాలి. మధ్యాహ్న భోజన పథక కార్మికులకు ఒకటో తేదీనే జీతం వేసి కూరగాయల బిల్లులు చెల్లించాలి. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తాం.



- డి.భాగ్యలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం జిల్లా గౌరవధ్యక్షులు, అన్నమయ్య జిల్లా.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. పార్లమెంటు వేదికగా అమిత్ షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ విసికె పార్టీ ప్రతినిధులు గురువారం స్థానిక బెంగళూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా చిత్రపటాలు మంటల్లో దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అంబేద్కర్ చిత్రపటాల ప్ల కార్డులను ప్రదర్శించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ మీద ఆయన రాసిన రాజ్యాంగం మీద గౌరవం లేని అమిత్ షాకు రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో కొనసాగే అర్హత లేదని, ఆయన వెంటనే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి, స్వర్గానికి వెళ్లి అక్కడి పదవులు చేపట్టడం మంచిదని సూచించారు. అంబేద్కర్ స్వర్గానికి వెళ్లాలను కోలేదని, ఆయన భారత దేశాన్ని స్వర్గ ధామంగా చేసి ఇక్కడే ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని పరితపించారని చెప్పారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం నేడు 140 కోట్ల భారతీయుల సుఖ సంతోషాలకు భరోసాగా నిలిచిందని చెప్పారు. ప్రజల కష్టాలు, కన్నీళ్లు తుడిచిన వాడు భగవంతుడైతే, అంబేద్కర్ కూడా భగవంతుడేనని చెప్పారు. అంబేద్కర్ వల్లే తాను ప్రధాని అయ్యానని చెప్పుకొనే మోడీ, అమిత్‌షా వ్యాఖ్యలపై మౌనం వహించడం సహేతుకం కాదన్నారు. మోడీ వెంటనే స్పందించి, అమిత్ షాను మంత్రి వర్గం నుండి తొలగించి, ఆయన చేత క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిజెపి ప్రజల ఆగ్రహానికి గురై, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో విసికె, బాస్ ప్రతినిధులు ముత్యాల మోహన్, నీరుగట్టి రమణ, పెద్దపాలెం రవిశంకర్, సొన్నికంటి రెడ్డెప్ప, బురుజు రెడ్డిప్రసాద్, కృష్ణ, జనార్ధన్, గంగాధర్, ఇర్ఫాన్, బండకోట రవి పాల్గొన్నారు.

వాల్మీకిపురం: అంబేద్కర్‌ని ఏకవచనంగా మాట్లాడి, అవమానపరచిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు శివయ్య అన్నారు. స్థానిక గాంధీ బస్టాండ్ కూడలి వద్ద మాలమహానాడు నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అమిత్‌షా డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, దేశానికి దిశానిర్దేశం చేసిన మహ నీయుడు అంబేద్కర్ అని, ఆయన రూపొందించిన రాజ్యాంగాన్ని అవమానించడాన్ని దేశం సహించ దన్నారు. అమిత్‌షా చేసిన వ్యాఖ్యాలకు క్షమాపణ చెప్పాలని, అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు చేపడుతామని హెచ్చ రించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగా ర్జున, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటస్వామి, నాయ కులు సుధాకర్, మహేష్, ప్రవీణ్, వెంకటముని, కుప్పస్వామి, సూరి, నారాయణ, బివి రమణ, సురేంద్ర, రాజన్న, లక్ష్మీనారాయణ, రమణ, రవి పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను కించపరుస్తూ దేశ ప్రజల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడినందుకు తక్షణమే ఆయన క్షమాపణ చెప్పి మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని మాజీ పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి పూల భాస్కర్ కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలను ఒక ప్రకటనలో ఖండించారు. రాజ్యాంగ ఫలాలు అందరికీ దక్కాలన్న అంబేద్కర్ నినాదాన్ని కించపరుస్తూ దేశ ప్రజల మనోభావాలు దెబ్బ తినేవిధంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షా కు మంత్రి పదవిలో కొనసాగే నైతిక హక్కు ఏమాత్రం లేదని, తక్షణమే మంత్రి పదవి నుండి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.



బీడీ కార్మికులతో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

బీడీ కార్మికులకు కూలి రూ.500 ఇవ్వాలి

- ఎపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్మికులకు వెయ్యి బీడీలు చుట్టడానికి కూలి రూ.500 ఇచ్చేలా ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కన్వీనర్ డి.భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం స్థానిక పాత రాయచోటిలోని బీడీ కార్మికుల నివాస ప్రాంతాలకు వెళ్లి బీడీ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీడీ కార్మికులకు యాజమాన్యాలు వెయ్యి బీడీలు చుట్టడానికి కేవలం రూ.260 కూలి ఇస్తున్నారని పేర్కొన్నారు. బీడీలు చుట్టడానికి 36 గంటలు నుండి 48 గంటలు పడుతుందని తెలిపారు. ఇతర పనులు చేసుకోకుండా పని చేస్తే రోజుకు తక్కువ ఇస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు కూలి సరిపోదని ఇతర రాష్ట్రాల మాదిరి రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీలు చుట్టే వారిలో దీర్ఘకాలిక వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరికీ రూ.2 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిని పునరుద్ధరించి ఆరోగ్యంతో పాటు వారి పిల్లలకు స్కాలర్‌షిప్ బేషరతుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులివ్వని యాజమాన్యం మీద కలెక్టర్ జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీడీ కార్మికులు జైబూన్, షాహీనా మస్తాని పాల్గొన్నారు

రసాభాసగా గ్రామ పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి-పీలేరు

పోలీసుల బందోబస్తు నడుమ పీలేరు గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. గురువారం సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష అధ్యక్షతన కార్యదర్శి గురుమోహన్ వార్డు సభ్యులతో సమావేశంలో కార్యదర్శి అజెండాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా సర్పంచ్, వార్డు సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో వీధి కుక్కలు పట్టడానికి ముందస్తు అనుమతులు పొందారా అని ప్రశ్నించారు. అందుకు కార్యదర్శి సమాధానమిస్తూ పట్టణ ప్రజల విన్నపం మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు సమాధానమిచ్చారు. ఆగ్రహించిన సభ్యులు మాట్లాడుతూ ప్రజల విన్నపం మేరకు పంచాయతీ ఆవాదంతో తాము కూడా వీధి కుక్కలు పట్టించి అటవీ ప్రాంతంలో వదలడం జరిగిందన్నారు. తాము నిబంధనలకు విరుద్ధంగా ఆ పనిచేశామని చెప్పుకొచ్చిన అధికారులు అదే తప్పును మళ్లీ మీరెలా చేశారని ప్రశ్నించారు. సర్పంచ్, వార్డు సభ్యులు, కార్యదర్శి మధ్య వాదోపవాదాలు తారాస్థాయికి చేరాయి. కార్యదర్శి నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో మురుగునీటి కాలువలు పూడుకుపోయి మురుగునీరు రోడ్లపైకి దొర్లుతున్నాయని, వీధులు చెత్తాచెదారాలతో నిండుకుంటున్నాయని విమర్శించారు. పట్టణ సిఐ యుగంధర్, ఎస్ఐ బాలకృష్ణ అక్కడికి చేరుకుని, ప్రజావసరాలు, పంచాయతీ అభివృద్ధి, ఆదాయ, వ్యయాలపై మాత్రమే చర్చించుకోవాలని ఇతరత్రా అంశాలపై చర్చవద్దంటూ ఇరువురికి సర్ది చెప్పారు. సభ్యులు శాంతించి అజెండా విషయాలపై మాత్రమే చర్చించి ఆమోదాలను తెలుపుకువచ్చారు. సర్పంచ్ హబీబ్‌బాష మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లలో పనిచేసిన సిబ్బందికి మూడు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉందని వారికి వేతనాలు చెల్లించడంతోపాటు కొత్తగా నియమితులైన సిబ్బందికి కూడా వేతనాలు ఇవ్వాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్మికులకు తాము వేతనాలను రూ.3000లకు పెంచి ఇచ్చామని, కార్యదర్శి గారు నిధుల కొరత కారణం చూపుతూ వారికి వేతనాలు రూ.1000 తగ్గించి ఇస్తున్నారని, తగ్గించిన ఆ వేయి రూపాయలను తిరిగి పెంచాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి గురుమోహన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నిధుల లభ్యతను బట్టి పనులకు ప్రాధాన్యతనిస్తూ నిధులు వెచ్చించాలని సూచించామన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్స్పెక్టర్ నౌషాద్, వార్డు సభ్యులు ఉదయ్, విక్టరీ వెంకట రమణారెడ్డి, శ్రీనాథరెడ్డి, షాజహాన్, ఆబిద్, తదితరులతోపాటు సచివాలయాల ఉద్యోగులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సభ్యులకు సర్దిచెబుతున్న సిఐ, ఎస్ఐ

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గిరిజన గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు సిఐటియు నాయకులతో కలిసి గురువారం స్థానిక టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజుకు తన నివాసంలో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో టీచర్లు కుళ్లాయప్ప మహాదేవ్, సుధాకర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం గతంలో నాగరికతకు దూరంగా బతుకుతున్న గిరిజన బిడ్డల ఉజ్వల భవిష్యత్ కోసం చిత్తశుద్ధితో గిరిజన సంక్షేమ పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో టీచర్స్ తక్కువ వేతనాలతో నియమించిందన్నారు. 15 ఏళ్లుగా వారు తక్కువ వేతనంతో విధులు నిర్వహిస్తున్నారని ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న డిఎస్‌సి నియామకాల్లో వీరిని మినహించి మిగిలిన పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. ట్రైబల్ టీచర్లను కాంట్రాక్టు రెసిడెన్సియల్ టీచర్లుగా మార్చాలని కోరారు. పెరిగిన ధరలకను గుణంగా 2022 పిఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కలిపించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక శాసనసభ్యులు, మంత్రి ద్వారా విద్యా శాఖ, గిరిజన శాఖలకు లేదా ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జగన్మోహన్‌రాజుకు ట్రైబల్ టీచర్స్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు కాదంబరి, రహీమ్, స్వర్ణలత, విజయకుమారి, గీతాంజలి, వెంకటశివమ్మ, సుమతి పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ఇన్నోవేషన్ డిజైన్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-మదనపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో సిఎస్ఇ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో థింకింగ్ క్రిటికల్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ డిజైన్‌పై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బెంగళూరు ఎఎస్‌కె ఆటోమోటివ్ ప్రయివేట్ లిమిటెడ్ అడిషనల్ జనరల్ మేనేజర్ గోవిందరావు హాజరై విద్యార్థులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ క్రమశిక్షణతో తమ తెలివితేటలు ఉపయోగించి సాఫ్ట్వేర్లను ఎలా తయారు చేయాలో అలాగే తమ క్రియేటివిటీని ఎలా పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. కొత్త కొత్త టెక్నాలజీలను ఏ విధంగా కనిపెట్టాలో దానిని ఉపయోగించి పరిశ్రమలలో ఉద్యోగాలు ఎలా పొందాలో వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి ప్రోగ్రామ్లలో పాల్గొని తమలోని సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. క్రమ శిక్షణతో తమ ఆలోచన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఎస్ఇ డిపార్ట్మెంట్ హెచ్ఒడి కె.లక్ష్మయ్య, కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.శివ శంకర్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి : సిఐ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సిఐ విశ్వనాధ్‌రెడ్డి, అర్బన్ సిఐ చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు శివాలయం చెక్ పోస్ట్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి వాహనాదారులకు హెల్మెట్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్ బరువుతో కాకుండా బాధ్యతతో ధరించి సురక్షితంగా ప్రయాణించాలని వాహనదారులను కోరారు. ద్విచక్రవహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించే అలవాటు చేసుకోవాలని కోరారు. రూ. లక్షలు వ్యయం చేసి బైక్‌లు కొన్నవారు హెల్మెట్ వాడక పోవడం చాలా బాధాకరం అన్నారు. మొబైల్ వాడకం పట్ల ఉండే ప్రాదాన్యత మన ప్రాణానికి ఎందుకు ఇవ్వలేక పోతున్నారని వారు ప్రశ్నించారు. ప్రస్తుతం హెల్మెట్ లేక పోవడం వల్లే అధికంగా మృత్యువాత పడుతున్నారని విచారాన్ని వ్యక్తం చేశారు. హెల్మెట్ లేని ప్రయాణం సురక్షితం కాదని, తప్పనిసరిగా ధరించాలని కోరారు. లేని పక్షంలో పోలీసు చర్యలు తప్పవని హెచ్చరించారు. ర్యాలీలో లయన్స్ క్లబ్ అఫ్ రాయచోటి టౌన్ సభ్యులు హరినాధరెడ్డి, షేక్ మహమ్మద్, శివారెడ్డి, ఎఎస్ఐ జోసేఫ్, శ్రీ సాయి ఇంజినీరింగ్ కలశాల యాజమాన్యం, విద్యార్థులు ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



స్కూటర్ ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐ

వినియోగదారులకు హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కల్గి ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకరయ్య పేర్కొన్నారు. గురువారం ఎపిసిఆర్ఎఫ్ సంస్థ అధ్యక్షులు తిరుపాల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిసిఆర్ఎఫ్ సంస్థ సభ్యులు మేకల దర్బార్ బాషా, విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి, పవన్, సాయి మాట్లాడుతూ. ప్రతి కొనుగోలుకు బిల్లు తీసుకోవడం మన హక్కు అని అన్నారు. కొనే ప్రతి వస్తువులోనూ లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత పొందడానికి వినియోగదారులందరూ తమ హక్కుల పై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. గుండు సూది నుండి విమాన ప్రయాణం వరకు కొనేవారు, ఖర్చు చేసే వారంతా వినియోగదారులేనన్నారు. మనం తాగే పాలు, నీరుతో పాటు కొనుగోలు చేసే ప్రతి వస్తువు నాణ్యత పై ప్రశ్నించే తత్వాన్ని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఉపాధ్యాయులు మార్ల ఓబుల్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా పరిరక్షణ కోసం ఉద్యమాలు

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యా పరిరక్షణ కోసం ఉద్యమాలు చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి పేర్కొన్నారు. మదనపల్లెలో ఈ నెల 28, 29వ తేదీలలో నిర్వహిస్తున్న జిల్లా ప్రథమ మహాసభకు విరాళాల సేకరణ గురువారం స్థానిక నారాయణ కాలేజ్‌లో చేపట్టారు. విద్యార్థులు, అద్యాపకులు స్పందించి విరాళాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ జయప్రదానికి తాము సైతం అంటూ విద్యార్థులు ముందుకొస్తున్నారన్నారు. ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఒకటైన తల్లికి వందనం ఎటువంటి షరతులు లేకుండా ప్రతి విద్యార్థికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ చేస్తున్న పోరాటంలో విద్యార్థులు భాగస్వాములై హక్కుల సాధనకు ఉద్యమించాల న్నారు. శాస్త్రీయమైన విద్యా విధానం, ప్రభుత్వ విద్య పరిరక్షణ, ఉపాధి కల్పన, భవిష్యత్తు తరాల కోసం ఎస్ఎఫ్ఐ చేసే పోరాటాల్లో విద్యార్థులు స్వఛ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మాస్ ఫండ్ క్యాంపియన్‌లో ఆర్ఐ తారక్, ప్రిన్సిపాల్ సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, కార్తీక్, జయ బాబు, అఫ్రిద్, తదితరులు పాల్గొన్నారు.

బుగ్గకాలువ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణం, వివేకానంద నగర్ దోబీఘాట్ గంగమ్మ గుడి వద్ద బుగ్గకాలువపై నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకొందని దీనిపై ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్పందించి చర్యలు చేపట్టాలని గురువారం మదనపల్లె టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంటు గొల్లపూడి తిరుపతిరావు, కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో వినియోగించిన కాంక్రీటు లేచిపోయి, ఇనుప కమ్మీలు బయటకు వచ్చి ప్రమాదకరంగా మారిందన్నారు. బ్రిడ్జి ఇరువైపులా రెయిలింగ్ ఊడిపోయి వాహనాలు కాలువలో పడిపోయే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. శిథిలావస్థకు చేరుకొన్న బ్రిడ్జిపైనే నిత్యం ట్రాక్టర్లు, లారీలు, బస్సులు, స్కూలు వ్యాన్లు, స్కూల్ బస్సులు రాకపోకలు సాగిస్తు న్నాయిని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో భారీ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం కూడా పొంచి ఉందన్నారు. కావున ఎమ్మెల్యే షాజహాన్ బాషా క్షేత్రస్థాయిలో బ్రిడ్జిను పరిశీలించి బ్రిడ్జి పునఃనిర్మాణం కొరకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులు నైపుణ్యతను పెంచుకోవాలి

ప్రజాశక్తి- రాయచోటి

విద్యార్థులను గూగుల్ డెవలపర్స్ స్టూడెంట్స్ క్లబ్‌లో సభ్యునిగా చేరి వివిధ ప్లాట్ ఫార్మలలో నైపుణ్యతను పెంచుకోవాలని సాయి విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల కోసం గూగుల్ డెవలపర్స్ స్టూడెంట్స్ క్లబ్, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ క్లబ్, టెక్నికల్ స్కిల్స్ క్లబ్ ఏర్పాటు, ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రతి రంగం గ్లోబలైజేషన్ వైపు అడుగులేస్తుందని టెక్నికల్ విద్యను అభ్యసించే, విద్యార్థులు గూగుల్ డెవలపర్స్ స్టూడెంట్స్ క్లబ్‌లో సభ్యునిగా చేరి వివిధ ప్లాట్ ఫార్మలలో నైపుణ్యతను పెంచుకోవాలని సూచించారు. ఈ గూగుల్ డెవలప్ ఫర్ స్టూడెంట్స్ క్లబ్ 110 దేశాలలో వివిధ యూనివర్సిటీలలో స్థాపించిందన్నారు. మిషన్ లెర్నింగ్, ఆండ్రాయిడ్, గూగుల్ క్లౌడ్, హ్యాకథాన్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించడం వల్ల విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవచ్చన్నారు. క్లబ్‌లో మెంబర్‌షిప్ సర్టిఫికెట్ పొందడం వల్ల ఉద్యోగ ప్రయత్నాలలో ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఇంగ్లీష్ కమ్యూనికేషన్ క్లబ్ సభ్యత్వం వల్ల ఇంగ్లీష్ భాషలో పట్టు సాధించి వివిధ ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఎప్పటికప్పుడూ టెక్నికల్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ కమ్యూనికేషన్ క్లబ్ కో- ఆర్డినేటర్‌గా ఎంబిఎ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.అశోక్ కో-ఆర్డినేటర్‌గా, టెక్నికల్ స్కిల్ క్లబ్ కో-ఆర్డినేటర్‌గా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ రాధాకృష్ణ, గూగుల్ డెవలప్మెంట్ క్లబ్ ఇన్‌ఛార్జిగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం నుండి అసోసియేట్ ప్రొఫెసర్ అతిక్‌ను నియమించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి


పశుగణనను నమోదు చేస్తున్న డిడి సత్యనారాయణ

గ్రామాల్లో పశుగణనపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

తంబళ్లపల్లి,పెద్దమండెం మండలాల పరిధిలోని మారుమూల గ్రామాలలో పశుగణన కార్యక్రమం ముమ్మరం చేయాలని మదనపల్లి పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ సూచించారు. గురువారం మండలంలోని పళ్ళు పంచాయతీలలో పశు గణన కార్యక్రమంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భకోశవ్యాధి నివారణ, గాలికుంటు వ్యాధి టీకాలు, వెయ్యదూడలకు బ్రూసిలోసిస్ టీకాలపై పాడి రైతులకు అవగాహన కల్పించి నివారణ చర్యలు ముమ్మరం చేయాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన గోకులాలు, గొర్రెలు, మేకల షెడ్లు త్వరగా పూర్తి చేయడానికి సంబంధిత లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా రైతులతో డిడి ముఖాముఖి మాట్లాడి పాడిపశువుల సంరక్షణ, వ్యాధులు, నివారణ ఉపాయాలు, పశువైద్య సిబ్బంది పనితీరుపై అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె పశుగణాభివృద్ధి కేంద్రం ఎడి సుమిత్ర, కన్నె మడుగు పశువైద్యరాలు సుజన శ్రీ, వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని తిప్పాయపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఎస్. రాధాకృష్ణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టికమ్మపల్లికి చెందిన హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ అనే ఇద్ద రు జిల్లా అవార్డు గ్రహీతలను ఎస్‌టియు ఆధ్వర్యంలో మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై.సుబ్రహ్మణ్యంరాజు, జిల్లా అధ్య క్షుడు అంకం శివారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నరేంద్రనాథ్, రీజినల్ కన్వీనర్ నరసింహ జిల్లా అవార్డు గ్రహీతలను ప్రత్యేకంగా సన్మానించారు.

మండల సర్వసభ్య సమావేశం రద్దు

ప్రజాశక్తి-బి.కొత్తకోట



సమావేశం వాయిదా వేసినట్లు తెలుపుతున్న ఎంపిడిఒ

ఎంపిటిసిల సంఖ్యా బలం లేని కారణంగా బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం రద్దయినట్లు ఎంపిడిఒ శంకరయ్య పేర్కొన్నారు.ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపిపి, ఎంపిటిసిలు హాజరు కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కనీస బలం ఆరుగురు ఎంపిటిసిలు హాజరు కాకపోవడం ఇందుకు కారణమన్నారు. ఎంపిటిసిలకు సమాచారం ఇచ్చామని, అయినా ఎవరూ హాజరు కాలేదన్నారు. అధికారులంతా తమ నెలవారి నివేదికలతో హాజరై నిరీక్షించి వెనుతిరిగి వెళ్లిపోయారని అన్నారు. మరల మండల సర్వసభ్య సమావేశం నిర్వహించే తేదీని తెలుపుతామని ఎంపిడిఒ తెలిపారు. మండల సర్వసభ సమావేశం జరిగితే అడ్డుకోవాలని కూటమి నాయకులు ఎంపిడిఒ కార్యాలయానికి చేరుకున్నారు వారికి ఆ అవకాశం లేకుండా ఎంపిటిసిలే హాజరు కాలేదు.

చౌకదుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో ఖాళీగా ఉన్న ఆరు రేషన్ షాపులకు డీలర్లను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయుటకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. మండలంలో రిజర్వేషన్ల వారీ తంబళ్లపల్లె(ఎస్‌సి), వెంకటరెడ్డిగారిపల్లె(బిసి-డి),రెడ్డివారిపల్లె(ఒసి-మహిళ), తిమ్మయ్య ఇండ్లు(బిసి-బి), చెరువుముందరపల్లి(బిసి-బి(మహిళ)), గంగిరెడ్డిపల్లి(బిసి-బి) ఖాళీలున్నట్లు తెలిపారు. ఇంటర్ పాసైన,18-40సంవత్సరాల లోపు స్థానికులు అర్హులని తెలిపారు. ఇంటర్ పాసైన అభ్యర్థులు లేకపోతే ఇంటర్ చదివి ఫెయిల్ అయిన వారిని పరిగణలోకి తీసుకోబడుతుందన్నారు. అర్హులైన, ఆసక్తి కలిగిన వారు ఈనెల 21న సాయంత్రం 5గంటల లోపు తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తును అందజేయాలని తెలిపారు. దరఖాస్తులు అర్హత కలిగిన అభ్యర్థులకు 28న ఉదయం 10 గంటలకు రాత పరీక్ష ఉంటుందన్నారు. రాత పరీక్షలో అర్హత మార్కులు సాధించిన వారికి ఈనెల 30,31తేదీలలో ఇంటర్యూలు నిర్వహించి 1:15నిష్పత్తిలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అభిజిత్ సరలాయ

'మిట్స్'లో డేటాసైన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి : అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగం వారు దేవాప్స్ ఎస్సెన్షియల్స్ విత్ టూల్స్ అనే అంశంపై మూడు రోజుల హాండ్స్ ఆన్ వర్కుషాప్‌ను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగుళూరుకు చెందిన ఎల్అండ్‌టి హెడ్, ప్రైవేట్ లిమిటెడ్ హెడ్ కె.అభిజిత్ సరళాయ, సీనియర్ అసోసియేట్ దేవోప్స్ ఎం.విజయశాంతి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేవోప్స్ ఎస్సెన్షియల్స్ విత్ టూల్స్ ఎఐతో దాని ఏకీకరణపై తన విస్తృతమైన పరిశ్రమ పరిజ్ఞానాన్ని పంచుకున్నారు. వేగవంతమైన సాంకేతికతతో నడిచే ప్రపంచంలో కంపెనీలు సాఫ్ట్‌వేర్ సేవలను వేగంగా, మరింత సమర్థవంతంగా, తక్కువ లోపాలతో అందించడానికి నిరంతరం ఒత్తిడికి గురవుతు న్నాయన్నారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఐఐ కార్యకలాపాలతో కలపడం వేగంగా, మరింత విశ్వసనీయమైన ఉత్పత్తి డెలివరీని ఈ డెవోప్స్ అనుమతిస్తుందని అన్నారు. విద్యార్థులు వీటిపై అవగహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సి పల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ కుసుమ, అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.శ్వేతా, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట అపరిశుభ్రత

- చెత్తా చెదారంతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టని అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు


బాలుర ఉన్నత పాఠశాల ఎదుట వేసిన వ్యర్థాలు

మండల కేంద్రం గాలివీడులోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న రోడ్డుపై స్థానిక ప్రజలు చెత్తా, చెదారం వేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద పచ్చదనంతో చిన్నపాటి పార్కును ఏర్పాటు చేశారు. చెట్లను కుండీలలో భద్రపరిచారు. ఆహ్లాదకరంగా ప్రాంతంలో ఆ చుట్టుపక్కల నివాసులు వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని ఠశాల పార్క్ ఎదుట తెచ్చి వేయడంతో చెత్త దిబ్బలా తయారైంది. పట్టణంలో గేటు, హైస్కూలు, పావని సర్కిల్, బస్టాండు, పక్కిరెడ్డిగారిపల్లి సర్కిల్ వద్ద డస్ట్‌బిన్ లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పాఠశాల ఎదుట చెత్తను వేయకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. వ్యర్థపదార్థాలను పంచాయతీ చెత్త బండి లోనైనా ప్రజలు తెచ్చి వేసేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చెత్తను తొలగింపజేసి మరల చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


నిమ్మనపల్లె : ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ ధనుంజయులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రైతుల భూ సమస్యలను తీర్చడమే రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమని తహశీల్దార్ ధనుంజయులు పేర్కొన్నారు. గురువారం రెడ్డివారిపల్లి సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సర్పంచ్ నూతనకాల్వ రెడ్డమ్మ, నరేంద్రరెడ్డి, రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్, మాజీ ఎంపిటిసి నాగరాజనాయుడులతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రతి సోమవారం మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నాదని అన్నారు. వివిధ సమస్యలతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే తమ గ్రామంలోకి వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నాదని పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూమి సమస్యలను పరిష్కరిస్తూ నిజమైన అర్హులకు భూమిపై హక్కులను కల్పించడం జరుగుతుందన్నారు. డికెటి భూములు, నిషేధిత జాబితాలోని భూములను అమ్మడం కానీ, కొనడం కానీ చట్టరీత్యా నేరమన్నారు. భూమి కొనుగోలుదారులు సరైన ధ్రువపత్రాలను పరిశీలించుకుని కొనుగోలు చేసుకోవాలని, లేకుంటే భవిష్యత్తులో వారికి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. భూములు అన్యాక్రాంతానికి గురికాకుండా పర్యవేక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వంల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్-2024 చట్టాన్ని తీసుకవచ్చినట్లు తెలిపారు. అనంతరం సర్పంచ్ నూతన కాలువ రెడ్డమ్మ నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్ జె వెంకటేష్ మాట్లాడుతూ డికెటి భూములను అనుభవంలో ఉన్న కుటుంబాలకు పట్టా భూములుగా మార్చాలని తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు మహేష్ రెడ్డి, ప్రసాద్, సర్వేయర్ గోపీనాథ్, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, అటవీశాఖ అధికారులు శోభారాణి, హరినాథ్‌రెడ్డి, విఆర్ఒలు హేమాంబర్‌రెడ్డి, నాగరాజా, హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, కానిస్టేబుల్, రాజేష్, దేవాదాయ శాఖ అధికారులు, గ్రామ సర్వేయర్లు, ప్రజలు పాల్గొన్నారు. **పీలేరు:** ప్రజా సమస్యల పరిష్కార వేదికగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఎం. భీమేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులలో భాగంగా పీలేరు మండలం, రేగళ్ళు గ్రామ పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ గ్రామంలో సామాజిక సమస్యల పట్ల ప్రజలు స్పందించి విన్నపాలు అందించాలని కోరారు. గ్రామస్తులు మాట్లాడుతూ రేగళ్ళు గ్రామంలో తాగునీరు, రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్నాయని అన్నారు. ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు ఏవైనా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఉంటే తమ గ్రామం కోసం మంజూరు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

పంచాయతీల అభివృద్ధి లక్ష్యంగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, సచివాలయ ఉద్యోగులు, పనిచేయాలని ఎంపిడిఒ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో రెండు రోజులుగా జరిగిన శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి.స్థానికరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల మేరకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రతి పంచాయతీ మంచి ర్యాంక్ సాధించి అభివృద్ధి దిశలో పయనించే విధంగా శిక్షణ పొందిన వారందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్, కార్యాలయ ఎఒ థామస్, ఎపిఎం గంగాధర్, ఎపిఒ అంజనప్ప పాల్గొన్నారు. **బి.కొత్తకోట :**గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ శంకరయ్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ విభాగం అద్వర్యంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద డిపిఆర్‌సి చిత్తూరు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్‌లు, గ్రామీణ ప్రాంతాలలో పనిచేయు పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, సర్వే అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్లకు, విఆర్‌ఒలు, ,వెటర్నరీ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు, సిరికల్చర్ అసిస్టెంట్స్, ఐసిడిఎస్ ఉద్యోగులు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి ఎంపిడిఒ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, 2047 నాటికి సాధించాల్సిన లక్ష్యాలపై శిక్షణార్థులకు సమగ్రమైన అవగాహన కల్పించారు.కార్యక్రమంలో మండల ఇంజినీర్ ఎఇ, ఐసిడిఎస్ థీమ్స్ వారీగా శిక్షణ ఇచ్చారు.**పీలేరు:** స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగిసిందని ఎంపిడిఒ శివశంకర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళిక 2024-25 అమలులో భాగంగా పీలేరు మండల పరిధిలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సర్పంచులకు స్థానిక సి.ఎల్.ఆర్.సి భవనంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రిన్సిపల్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆదేశాల మేరకు మండల పరిధిలోని గ్రామ స్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులకు స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి అంశాలపై ఈ శిక్షణను ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి లతీఫ్ ఖాన్, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప, వెలుగు ఏపిఎం జోహార్ బాష, ఐసిడిఎస్ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



తంబళ్లపల్లి : మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉపేందర్‌రెడ్డి

తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యం

- టిఎన్ఎస్ఎఫ్ వేదికగా యువతలో చైతన్యం
- ముఖ్యమంత్రి చంద్రబాబే స్ఫూర్తి
- టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



విద్యార్థి దశ నుంచి అనేక పోరాటాలు సలుపుతూ టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాన్ని వేదికగా చేసుకొని యువతలో చైతన్యం నింపుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యంగా యువతను సమాయత్తం చేయడం జరుగుతోందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ రేవూరి వేణుగోపాల్ పేర్కొన్నారు. వేణుగోపాల్ గురువారం ప్రజాశక్తితో మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు టిడిపిపైనే ఆధారపడి ఉందని, విజనరీ నాయకుడు సిఎం చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు. విద్యార్థి దశ నుంచే చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకొని 2007లో తెలుగునాడు విద్యార్థి సమాఖ్య టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తూ ఉమ్మడి కడప జిల్లా అధికార ప్రతినిధిగాను, జిల్లా అధ్యక్షుడిగా పనిచేశానని అన్నారు. 2020లో రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడిగా ఎన్నికై ఉద్యమాలే ఊపిరిగా విద్యార్థుల సంక్షేమం కోసం పోరాటాలు చేసి వివిధ పోలీస్ స్టేషన్ల లో కేసులను ఎదుర్కోవడం జరిగిందని వివరించారు. చంద్రబాబు అధికారం చేపట్టాక ముఖ్యమంత్రి హోదాలో ప్రతి గ్రామంలో ఒక పాఠశాల, పంచాయితీ పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రతి మండల కేంద్రంలోనూ జూనియర్ కళాశాలలు, నియోజకవర్గం స్థాయిలో ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటుచేసి ఎస్‌సి,ఎస్‌టి,బిసి, మైనారిటీ విద్యార్థుల విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని అన్నారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో తాను పోలీసు లాఠీ దెబ్బలు, కేసులు భరించి పాఠ శాలలు, సంక్షేమ హాస్టళ్లు, విద్యా ర్థుల సంక్షేమం కోసం నిరంతర పోరాటాలు కొనసాగిస్తూ రాష్ట్రం లో తెలుగు దేశం పార్టీ బలోపే తానికి నిరంతర పోరాటం సాగిస్తు న్నామన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనూ సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల వారికి సమన్యాయం కల్పిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు తీసుకొస్తు న్నారన్నారు. తండ్రి బాటలోనే తనయుడు నారా లోకేష్ కూడా యువగళం పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకున్నారని అన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి విద్యాశాఖ మంత్రిగా తనదైన శైలిలో దూసుకుపోతున్నారని తెలిపారు. తాను టిడిపికి విధేయుడునని, విద్యార్థి నాయకుడిగా గ్రామస్థాయి నుంచి విద్యార్థులను కలుపుకొని టిడిపిని దేశంలోనే తిరుగులేని రాజకీయ శక్తిగా నిర్మించేందుకు తన సర్వశక్తులు ఒడ్డుతానని పేర్కొన్నారు.

విద్యుత్‌ను పొదుపు చేసి భావితరాలకు వెలుగునిద్దాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహోద్యమంగా విద్యుత్ పొదుపు చేసి భావితరాలకు వెలుగునిద్దాం అనే నినాదంతో విద్యుత్ వినియోగదారులకు ట్రాన్స్ కో ఉద్యోగులు గురువారం పట్టణంలో చైతన్య ప్రదర్శన నిర్వహించారు. స్థానిక సిటియం రోడ్డు ట్రాన్స్ కో డివిజన్ కార్యాలయం వద్ద నుంచి బయల్దేరిన ర్యాలీలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గంగాధరం, డిఇఇ హరి కుమార్, సురేంద్ర నాయక్, ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ఇంధనం పొదుపు చేద్దాం, భావితరాలకు వెలుగునిద్దామన్న నినాదంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కరెంటును ఆదా చేసి భవిష్యత్తు తరాలకు భరోసా నివ్వాల్సిన వసరం ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. విద్యుత్ వినియోగదారు కచ్చితంగా విద్యుత్ పొదుపును పాటించాలని సూచించారు. ఒక యూనిట్ విద్యుత్తును ఆదా చేయడం, ఉత్పత్తి చేయడం కంటే గొప్ప ప్రయోజమన్నారు. కావున ప్రతి కుటుంబం, కార్యాలయాలలోన తూచా తప్పక విద్యుత్ పొదుపును పాటించాలని సూచించారు. ఈ ర్యాలీలో ట్రాన్స్ కో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది


రాత్రి వేళలో ప్రభుత్వ ఆసుపత్రిలో మూసివున్న తలుపులు

రాత్రి వేళల్లో ప్రభుత్వ ఆస్పత్రిలో అందని వైద్యం

- అవస్థలు పడుతున్న రోగులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక పట్టణంలోని సిహెచ్‌సి ప్రభుత్వాసుపత్రిలో రాత్రి వేళల్లో వైద్యం సరిగ్గా అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రికి వెళితే నర్సులు డాక్టర్లకు తెలియపరచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారని బాధితులు వాపోతున్నారు. అధిక జ్వరంతో మూడు గంటల సమయంలో పట్టణానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి ఆసుపత్రికి వెళ్లగా కనీసం టెస్టులు కూడా చేయకుండా డోలో మాత్రలు ఇచ్చి పంపార న్నారు. మరల జ్వరం ఎక్కువగా ఉండ డంతో ఐదు గంటల సమయంలో ఆస్పత్రికి వెళ్లి చూడగా తలుపులు వేసుకొని ఉన్నారని బాధితుడి బంధువులు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు పనితీరు బాగా ఉన్నందు వలన ఒపిలు పెరిగాయి. అనారోగ్యంతో వచ్చిన రోగులకు వైద్యం అందించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రసాద్ బంధువు పవన్ రాత్రివేళలో ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లి చూపించగా 103 డిగ్రీల జ్వరం ఉన్నట్లుగా తెలిపారు. కనీసం జ్వరం ఎంత ఉందో కూడా పరీక్షించకుండా మాత్రలు ఇచ్చి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పేదలకు మెరుగైన వైద్యం అందిం చాలని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉండడం శోచనీయమని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రాత్రి వేళల్లో కూడా మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మహాలాక్టో కంపెనీ ప్రతినిధులుతో కొండా నరేంద్ర

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం : 'కొండా'

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే తన లక్ష్యమని ప్రముఖ పారిశ్రామికవేత్త కొండా నరేంద్ర స్పష్టం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ శాతం బాగా పెరిగిపోతోందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి చిత్తూరులో ప్రఖ్యాతి గడించిన న్యూట్రిన్ మహాలాక్టో చాక్లెట్ కంపెనీని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో వేలాది మందికి ఉపాధి కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లోని అత్యంత వెనుకబడిన తంబళ్లపల్లి నియోజకవర్గంలో చాలామంది నిరుద్యోగులుగా ఉండిపోయారన్నారు. ఈ పరిశ్రమలో నిరుద్యోగుల విద్యార్హతలను బట్టి ఉద్యోగాలు కేటాయిస్తామన్నారు. తనకు జన్మనిచ్చిన గడ్డ రుణం తీర్చుకునే అవకాశం లభించడం గర్వంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కొనుగోలు కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మహాలాక్టో కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న డిఎఒ చంద్రానాయక్

ఇ-పంట నమోదు తప్పనిసరి : డిఎఒ

ప్రజాశక్తి-చిన్నమండెం

రబీలో పంటలు సాగు చేసే రైతులు ఇ-పంట నమోదు తప్పక చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మండలం వండాడి రైతు సేవా కేంద్రం పంట నమోదును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇ-పంట నమోదు తో పాటు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని తెలిపారు. ఇ-పంట నమోదు చేయించుకోవడం వలన ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలకు అర్హులు అవుతారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గుచూపాలని, అధిక దిగుబడులు సాధించవచ్చునితెలిపారు. రైతులు అవగాహనతో పంటలు సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి గీత, వ్యవసాయ విస్తరణ అధికారి అనూష, రైతులు పాల్గొన్నారు.

జడ్జి బంగ్లాలో శ్రీగంధం చెట్లు నరికివేత

- కేసు నమోదు : డిఎస్‌పి కొండయ్య నాయుడు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక పట్టణంలోని మదనపల్లె జడ్జి బంగ్లాలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్రీగంధం చెట్లు నరికేసి దుంగలను చోరీ చేశారు. గురువారం తెల్లవారుజామున బంగ్లా అటెండర్ ముని వెంకటప్ప గుర్తించి ఎడిజె అబ్రహాంకు సమాచారం ఇవ్వడంతో ఎడిజె విషయాన్ని డిఎస్‌పి కొండయ్య నాయుడుకు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఒకటవ పట్టణ సిఐ ఎరిషావల్లి, ఎస్‌ఐ వెంకట శివకుమార్‌లు విచారణ చేపట్టారు. సిఐ కథనం మేరకు..పటేల్ రోడ్డులోని జడ్జి బంగ్లాలో కొన్ని శ్రీగంధం చెట్లు వున్నాయి. వాటిని గమనించిన ఎర్రచందనం దొంగలు అదును చూసి రాత్రి చెట్లను నరికేసి అందులో అవసరమైన దుంగలను చోరీ చేసి పరారయ్యారు. అటెండర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు చేయగా డాగ్స్ సోసైటీ కాలనీ వరకూ వెళ్లి ఆగిపోయి నట్లు తెలిపారు. నిత్యం పహారా ఉన్న జడ్జి బంగ్లాలోనే ఎర్రచందనం దొంగలు యథేచ్ఛగా చెట్లను నరికి ఎత్తుకుపోవడంతో పోలీసుల వైఫల్యం కొట్టిచ్చినట్లు కనబడుతోందని పట్టణ ప్రజలు గుసగుస లాడుతున్నారు.


బంగ్లాలో నరికేసిన శ్రీగంధం చెట్లు